


నర్సాపూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల

నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 13 ఆగస్టు 2024 | SANGAREDDY

# సమస్యలతో సహవాసం

## నర్సాపూర్‌లోని గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో సమస్యల తిష్ట

- దోమల బెడదతో విద్యార్థుల ఇబ్బందులు
- పేరుకుపోయిన పిచ్చిగడ్డి, మురుగు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

శివ్వంపేట, ఆగస్టు 12: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో కొన్ని సమస్యలు నెలకొన్నాయి. 25 ఏండ్ల క్రితం నిర్మించిన ఈ గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలు వేరువేరుగా ఉంటాయి. గిరిజన పాఠశాలలో బాల బాలికలతో కలసి 306 మంది విద్యార్థులు ఉంటారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను బోధిస్తున్నారు. 10మంది రెగ్యులర్, 15 మంది పార్ట్‌టైం ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ హాస్టల్ విద్యను అభ్యసించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఇంటర్‌మీడియట్ విషయానికొస్తే మొత్తం 203 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 11మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎఅండ్‌టీ కోర్సులు ఉన్నాయి. పూర్తిస్థాయి సిబ్బంది, మైదానం ఉన్నప్పటికీ విద్యార్థులు పడుకునే గదులు కొంత ఇరుకుగా ఉన్నాయి. ఆ గదుల్లో ఉండే కిటికీలకు దోమతెరలు లేకపోవడంతో దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు అందరూ ఒకే దగ్గర కింద కూర్చొని భోజనం చేస్తున్నారు. వంట సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థులే తోటి విద్యార్థులు భోజనం వడ్డిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లేట్లు శుభ్రం చేసుకునే ట్యాంకు వద్ద పిచ్చిగడ్డి, మురుగు పేరుకుపోయాయి. దీంతో విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. మరుగుదొడ్లు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, నివాస గదులు, నూతన తలుపులు, కిటికీలు, లైబ్రరీ పుస్తకాలు వంటి సమస్యలు ఉన్నాయి.


### ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం

గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాల సమస్యలపై ఈనెల 1న గురుకులం సెక్రటరీ సీతాలక్ష్మి దృష్టికి తీసుకెళ్లాం. మరుగుదొడ్లు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, నివాస గదులు, నూతన తలుపులు, కిటికీలు, లైబ్రరీ పుస్తకాలు వంటి అవసరాలు ఉన్నాయని, ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని సెక్రటరీకి విన్నవించాం.

-బలరామ్‌నాయక్,
గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, నర్సాపూర్, మెదక్ జిల్లా



తోటి విద్యార్థులకు వడ్డిస్తున్న విద్యార్థులు



డైనింగ్‌హాల్‌లో నిరుపయోగంగా నల్లాలు







నర్సాపూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో ట్యాంకుల వద్ద పేరుకుపోయిన గడ్డి, మురుగు, అస్తవ్యస్తంగా విద్యార్థులు నిద్రించే రూమ్, కిటికీలకు దోమతెరలు లేని దృశ్యం



సిద్దిపేట జిల్లా చేర్యాలలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్

- త్వరలో తపాస్‌పల్లి, లద్నూర్ రిజర్వాయర్లకు గోదావరి జలాలు
- చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధిస్తాం
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 12: 'గోదావరి నిండుగా ప్రవహిస్తున్నది. జలాలను ఎత్తిపోసేందుకు మోటార్లు, పంపులు ఉన్నాయి...పంపింగ్ చేసిన నీటి కోసం రిజర్వాయర్లు, నీళ్లు పారించేందుకు కాల్వలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ సర్కారు గోదావరి నీటిని సముద్రం పాలు చేస్తుంది. అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్స్‌లో సోమవారం చేర్యాల, చేర్యాల టౌన్, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాలకు చెందిన 147 మందికి రూ.39,01,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సాధకుడు కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దండగ చేసిందని, ఇప్పటివరకు రైతులకు రైతుబంధు అందించలేదన్నారు. రైతులు వడ్డీ వ్యాపారులు, బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ఎలాంటి కొర్రీలు పెట్టకుండా భూమి ఉన్న ప్రతి రైతుకూ రైతుబంధు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్లకు గోదావరి జలాలు పంపింగ్ చేసి వాటిని కాల్వల ద్వారా చెరువులు నింపితే భూగర్భజలాలు పెరిగి రైతులు పంటలు సాగు చేసుకునే వారని, గోదావరి జలాలు ఎత్తిపోస్తే కరెంట్ బిల్లు ఖర్చవుతుందని రైతన్నల కన్నీళ్లు తెప్పిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో 20లక్షల ఎకరాలు ఉన్న వ్యవసాయసాగు కేసీఆర్ రైతులకు నీళ్లు, కరెంట్, రైతుబంధు తదితర వాటిని అందించడంతో అదికాస్తా 70లక్షల ఎకరాలకు చేరిందన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఈ ప్రాంత ప్రజల సహకారంతో తప్పక సాధిస్తానని, డివిజన్ ఏర్పాటు అంశాన్ని ఇప్పటికే అసెంబ్లీలో మాట్లాడినట్లు తెలిపారు. తపాస్‌పల్లి, లద్దునూరు రిజర్వాయర్లు నింపాలని అసెంబ్లీలో పోరాటం చేశానని, త్వరలో గోదావరి జలాలు రానున్నట్లు తెలిపారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు ఎత్తుకుపోతున్నారని కొందరు అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారని, తప్పుడు ప్రకటనలు చేయడం మానుకోవాలన్నారు. సిద్దిపేటలోని రంగనాయకసాగర్ నుంచి ధూళిమిట్ట, చేర్యాల మండలంలోని కొన్ని గ్రామాలకు నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు అభివృద్ధి కోసం చేర్యాలకు నిధులు మంజూరు చేయిస్తే కొందరు తమ ఇంటి ముందు, కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సొంత దవాఖాన నీలిమాలో ఉచిత వైద్యం కొనసాగుతుందని, నిత్యం నియోజకవర్గానికి చెందిన 350 మంది రోగులు వస్తున్నారని వారి కోసం దవాఖాన ఆవరణలో ప్రత్యేక హాల్ నిర్మించినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా దవాఖానలో వైద్య సేవలు కొనసాగుతాయన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోపాటు కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భూకబ్జాలు అవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని వెలుగులోకి తీసుకువస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మేక సంతోష్, మంద యాదగిరి, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం, మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, తలారీ కిషన్, వకులాభరణం నర్సయ్యపంతులు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలుయాదవ్, గదరాజు చందు, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, బూరగోని తిరుపతిగౌడ్, తాడెం రంజిత, పచ్చిమడ్ల మానసతో పాటు నాలుగు మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి




మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

మెదక్, ఆగస్టు 12 (నమస్తేతెలంగాణ)/మెదక్ మున్సిపాలిటీ:అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, దవాఖానల్లో ఈఎస్‌ఐ సౌకర్యాలు, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బస్వరాజు, బీడీ సిగార్స్ వర్కర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి బాలమణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం బీడీ కార్మికుల గురించి పట్టించుకోడం లేదని మండిపడ్డారు. బీడీలు చేయని వారికి రిటైర్మెంట్ పింఛన్, ఆసరా పింఛన్లు వస్తున్నాయని, వారిని గుర్తించి సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలో అధికారులతో సర్వే చేయించి బీడీలు చేయని అనర్హులను తొలిగించి, అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### పంద్రాగస్టుకు ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు12:స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గరిమాఅగర్వాల్‌తో కలిసి వేడుకల నిర్వహణపై అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల15న పంచాయతీలు, మండల కార్యాలయాల్లో ఉదయం 8 గంటలకు, ఐడీవోసీ, జిల్లా అధికారుల కార్యాలయాల్లో ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఉదయం 9.30 గంటలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జెండావిష్కరణ ఉంటుందని, వేడుకలకు అన్నిశాఖల అధికారులు, సిబ్బంది హాజరుకావాలన్నారు.

## రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు12: ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పినట్లు వారంలోగా రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట దళితబంధు బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండో విడత దళితబంధు లబ్ధిదారులను కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఎంపిక చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో దళితబంధును ఆపేశారన్నారు. ఎంపికైన వారికి దళితబంధు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరికి లబ్ధిదారులు వ్యక్తిగత దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో దళితబంధు సలహాదారు బాల నర్సు, ఎలుక దేవయ్య, మోహన్, ఈశ్వర్, 126మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.




సిద్దిపేట పట్టణంలోని విజయ డెయిరీ వద్ద ధర్నా చేస్తున్న పాడిరైతులు

## పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి

సిద్దిపేట, ఆగస్టు12: పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలని విజయ డెయిరీ జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాడి రైతులు సిద్దిపేట పట్టణంలో విజయడెయిరీ సెంటర్ నుంచి మెస్తాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి రైతులతో కలిసి ఆయన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఆరు వేల మంది పాడి రైతులు రోజూ విజయ డెయిరీకి 32 వేల లీటర్ల పాలు పోస్తున్నారని, రూ.12.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.15 రోజులకు ఒకసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉండగా రెండు నెలల 15 రోజుల పాలబిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు రాక పాడిపోషణ ఇబ్బందిగా మారిందన్నారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో వన్‌టౌన్ పోలీసులు రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో పాడి రైతులు బుచ్చిరెడ్డి, రామచంద్రం, ప్రశాంత్‌శర్మ పాల్గొన్నారు.

# ఎక్కడి సమస్యలు అక్కడే



మెదక్ జిల్లా తూప్రాన్ బాలుర గురుకులంలో వంట కార్మికులు లేక అన్నం వడ్డిస్తున్న విద్యార్థులు



మెదక్ జిల్లా తూప్రాన్ బాలుర గురుకులంలో నేలపైనే సామూహిక భోజనాలు చేస్తున్న విద్యార్థులు

- విద్యార్థులే వంట కార్మికులు
- నేలపైనే సామూహిక భోజనాలు
- క్వార్టర్లు లేక టీచర్లకు ఇబ్బందులు
- మెదక్ జిల్లా తూప్రాన్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల అవస్థలు

రామాయంపేట, ఆగస్టు 12: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని టీఎస్ బాలుర గురుకుల విద్యాలయం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. సరిపడా టీచర్లు ఉన్నా రోజురోజుకు సమస్యలు తీవ్రమవుతున్నాయి. సరిపడా భవనాలు లేక విద్యార్థులు చదువుకునే చోటే నిద్రించాల్సి వస్తున్నది. 10, 11తరగతుల విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయి. విద్యార్థులు చదువుకోవడం కోసం డార్మెటరీ భవనం లేక తినడం ఒకచోట, చదువుకోవడం ఒకచోట, పండుకోవడం మరోచోట ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. గురుకులంలో వంట కార్మికులు ఉన్నా విద్యార్థులే వడ్డించుకొని తినాల్సిందే. విద్యార్థులు తినడానికి డైనింగ్ రూములు లేక పాఠశాలలోని నేలపైనే (ఇరుకుగది) సామూహికంగా అన్నం తినాల్సిన పరిస్థితి నెలకొన్నది. గురుకులంలో క్వార్టర్లు లేక టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు.




### భవనాల కోసం ప్రతిపాదనలు పంపించాం

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రస్తుతం 5, 9 తరగతుల విద్యార్థులకు డార్మెటరీ భవనం లేక కొంత ఇబ్బంది ఉన్నది. టీచర్ల నివాసం కోసం క్వార్టర్లు లేక మరికొంత ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యలపై ప్రభుత్వ అధికారులకు నివేదికలు సమర్పించాం.త్వరలోనే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం


– మురళి, తూప్రాన్ గురుకుల ప్రిన్సిపాల్, మెదక్ జిల్లా

# ఫార్మాసిటీ వద్దేవద్దు

## రైతుల పక్షాన పోరాటం చేస్తాం

- ప్రభుత్వ కవ్వింపు చర్యలకు ప్రజలు, రైతులు భయపడొద్దు
- భూబాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్
- ఫార్మాసిటీ బాధితులకు సంఘీభావం
- జహీరాబాద్ ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేత

న్యాల్‌కల్, ఆగస్టు 12: రైతాంగానికి తీవ్ర నష్టాన్ని చేకూర్చే ఫార్మాసిటీ ఏర్పాటుకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ అన్నారు. నిమ్జ్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమానికి మద్దతు పలికి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే న్యాల్‌కల్ మండలాన్ని నిమ్జ్ పారిశ్రామిక ప్రాంతం పేరుతో నాశనం చేశారని, మళ్లీ కొత్తగా 2వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడానికి భూములు గుంజుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఫార్మాసిటీ కోసం ఎలాంటి సమాచారం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా భూసర్వే చేపట్టి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు, రైతులకు అండగా ఉంటూ వారి పక్షాన ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ రైతుల పక్షాన నిలిచి పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా ప్రజలు, రైతులు ఎవరూ సహించరన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు, రైతులందరూ కలిసి ఫార్మాసిటీకి వ్యతికరేకంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం ఫార్మాసిటీలో కోల్పోతున్న రైతుల భూములను పరిశీలించారు. ఫార్మాసిటీని ఏర్పాటు చేయవద్దని జహీరాబాద్ ఆర్డీవో రాజుకు రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ వల్లూరు క్రాంతితోపాటు మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు నారాయణ, రవీందర్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవికుమార్, సుభాశ్‌గుప్తా, నర్సింహారెడ్డి, విజయ్‌కుమార్, గుండప్ప, సంగ్రాంపటేల్, శ్రీకాంత్‌రెడ్డి, మారుతీయాదవ్, శ్రీపాతి, రాజుగౌడ్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, శివరాజ్, అశోక్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



డప్పూర్‌లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



జహీరాబాద్ ఆర్డీవోతో ఫార్మాసిటీ భూబాధితుల సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఆగస్టు 12: సీఎంఆర్‌ఎను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నాలుగు మండలాలు, రెండు పట్టణాలు, ఇతర నియోజకవర్గాలకు చెందిన 163 మంది బా ధితులకు రూ.54,61,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీచేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధులను అవసరాలకు వాడుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని, ప్రైవేట్ దవాఖానలో చికిత్సలు చేయించుకున్న బాధితులు నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పదేండ్లుగా పార్టీలకతీతంగా ఆపదలో ఉన్న బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్నారన్నారు. పట్టణంలో సగం వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, గతంలో చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, సదాశివపేట వైస్‌చైర్మన్ చింతా గోపాల్, శివరాజ్ పాటిల్, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదమ్మ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నర్సింహులు, మధుసూదన్‌రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని వంద పడకల దవాఖానను సందర్శించి రోగుల సమస్యలు తెలుసుకుంటున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

## మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక,ఆగస్టు12: రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని వంద పడకల దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కారణంగా దవాఖానకు రోగుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందడం లేదని, ఈ విషయంపై త్వరలోనే వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసి సమస్య పరిష్కరిస్తానన్నారు. దుబ్బాక దవాఖానకు గ్రామీణ ప్రాంత ప్రజలే అత్యధికంగా వస్తారని , ఇక్కడ మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దవాఖానకు రూ.50 లక్షల అంబులెన్స్ అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంబులెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్యసేవలందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ హేమరాజ్, వైద్యసిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడిపై కాంగ్రెస్ నేతల విమర్శలు

సిద్దిపేట టౌన్,ఆగస్టు 12: కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి పదవులు అమ్ముకుంటూ ప్రశ్నించిన వారిపై అనుచరులతో దాడులకు దిగుతూ..అక్రమ కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నాడని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత యేశం నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలపై నర్సారెడ్డి వేధింపులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. నర్సారెడ్డి బీసీ నాయకులను చిన్నచూపు చూస్తూ వారిని రాజకీయంగా అణగతొక్కుతున్నాడని ఆవేదన వ్యక్త చేశారు. తాను రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. మంత్రి దామోదర అనుచరుడిగా ఉంటున్నానని నర్సారెడ్డి పగపెంచుకున్నాడన్నారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నానని..నర్సారెడ్డి బిడ్డ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ చేస్తుంటే.. ఆమెకు సపోర్టు చేయమని చెప్పినందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రెస్‌నోట్ విడుదల చేసి డ్రామాలాడారన్నారు. త్వరలోనే పీసీసీ అధ్యక్షుడికి, క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు లడ్డుయాదవ్ , భిక్షపతి, విష్ణు పాల్గొన్నారు.